క్లుప్తంగా

మొదలైన రక్తపాతం


దున్న పోతును బలిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : టీడీపీ విజయం సాధించిన సందర్భంగా మండల కేంద్రంలో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నడిరోడ్డుపై టీడీపీ నేతలుదున్న పోతును బలిచ్చారు. టీడీపీ గెలిచి ఒకరోజుకే దున్నపోతును బలిచ్చి నడిరోడ్డుపై రక్తపాతం సృష్టించారని, ఐదేళ్లలో ఇంకెన్ని రక్త పాతాలు కళ్లార చూడాల్సి వస్తుందోని స్థానిక ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ శ్రేణులుఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పోలీసులు మాత్రం నిమ్మకు నీరెత్తిపట్లు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఫీల్డ్ అసిస్టెంట్ రాజీనామా

కూడేరు: మండల పరిధిలోని చోళసముద్రం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. బుధవారం ఏపీఓ తులసీ ప్రసాద్‌ను కలిసిన వెంకటేష్ తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈయన 2006 నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించారు. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేసినట్లు వెంకటేష్ తెలిపారు.

రైతులకు ఉచితంగా మొక్కలు

కుందుర్పి: స్థానిక కుసుమగిరి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బీడుభూముల్లో టేకు, వేప, కానుగ, అల్లనేరేడు వంటి మొక్కలను ఉచితంగా అందించనున్నట్లు సంస్థ సీఎస్సీ ప్రతినిధి నరసింహమూర్తి తెలిపారు. ఏడాది పాటు వాటికి నిర్వహణ నిధులు అందజేస్తామన్నారు. ముఖ్యంగా కర్ణాటక సరిహద్దు గ్రామాల రైతులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. అలాగే కర్ణాటకలో సాసులకుంట, కొత్తపల్లి రైతులు సైతం పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ నకళ్లతో తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకొంటే పక్షం రోజుల్లో మొక్కలు అందజేస్తామన్నారు.

భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటల సాగు

కుందుర్పి: మట్టి నమూనా పరీక్ష ఫలితాల ఆధారంగా రైతులు ఖరీఫ్‌లో పంటలు సాగు చేయాలని వ్యవసాయ అధికారి మహేష్ సూచించారు. బుధవారం కుందుర్పిలో రైతులకు నట్టినమూనాలపై రైతులకు అవగాహన కార్యక్రమం కల్పించడంతో పాటు రైతులకు ఖరీఫ్ పంటల సాగుపై సూచనలు సలహాలు అందజేశారు. మండల వ్యాప్తంగా 2,200 క్వింటాళ్ల వేరుశనగ విత్తనం అందజేశామన్నారు. అంతర పంటలుగా ఉలువ, అలసంద, కంది, ఆముదం వంటి పంటలను సాగు చేస్తే వేరుశనగకు సోకే చీడపీడలను కొద్దిమేర నివారించవచ్చాను. ఇప్పటికే బోరుబావుల కింద రైతులు 198 ఎకరాల్లో వేరుశనగ సాగుచేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పరామర్శ


మంగళమ్మను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజినేయులు

బొమ్మనహళ్: టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడి బళ్లారిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ తల్లి మంగళమ్మను బుధవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజినేయులు పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో టీడీపీ విజయం సాధించడంతో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయి దౌర్జన్యంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇంట్లోకి దూరి మహిళపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. ఆయన వెంట నాయకులు రామకృష్ణ, అనీల్‌రెడ్డి తదితరులున్నారు.

వ్యవసాయ పనుల్లో రైతులు


దేవరెడ్డిపల్లి గ్రామ సమీపంలో వేరుశనగ విత్తనాలను విత్తుతున్న రైతులు

గుమ్మఘట్ట: వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో అన్నదాతలు వ్యవసాయంపై దృష్టిసారించారు. ఇందులో భాగంగానే రైతులు ముందస్తుగా వేరుశనగను విత్తేందుకు ఆసక్తి చూపుతున్నారు. నేలను యంత్రాల సహాయంతో దుక్కిదున్ని శుభ్రం చేసుకుంటున్నారు. మరో పక్క అదే యంత్రాల సహాయంతో విత్తనాలు విత్తేందుకు సిద్ధమయ్యారు. మండలంలో ఇప్పటికే 80 ఎకరాలలో వేరుశనగ పంటను సాగు చేశారు.

ఆరోగ్యానికి అండ

- పీహెచ్‌సీల అభివృద్ధితో ఆరోగ్య ధీమా
- సరికొత్త వసతులతో ప్రభుత్వాస్పత్రులు



నూతన శోభను సంతరించుకున్న గుమ్మఘట్ట ప్రాథమిక వైద్యశాల

రాయదుర్గం: గతంలో పీహెచ్‌సీల్లో అరకొర వైద్యం అందేది. డాక్టర్లు ఉన్నా మందులు ఉండేవి కాదు. వైద్యుల పోస్టులు ఖాళీగా ఉంటే సకాలంలో నియామకం జరిగేది కూడా కాదు. పారాసిటమాల్‌తో పాటు సిరాప్‌లు అందుబాటులో ఉంచితే చాలు రోగులు అదృష్టంగా భావించేవారురు. లేదంటే నిరాశతో వెనుతిరిగాల్సి వచ్చేంది. అయితే నాడు–నేడు కార్యక్రమం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పీహెచ్‌సీల రూపురేఖలను మార్చేసింది. ప్రతి పీహెచ్‌సీకి రూ.50 లక్షలకు పైగా ప్రభుత్వం ఖర్చు చేసింది. దీంతోపాటు వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచేలా చేసింది.

ప్రతి ఆస్పత్రిలో 14 మంది సిబ్బంది

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన 59 నెలల కాలంలో జగన్ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసింది. పేదలకు నాణ్యమైన మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టింది. అంతకు ముందు అధ్వాన్నంగా మారిన ప్రాథమిక వైద్యశాలలకు నాడు–నేడు ద్వారా కొత్తరూపు తీసుకొచ్చారు. జిల్లాలో 45 ప్రాథమిక, 25 అర్బన్ ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. వీటి పరిధిలోని సుమారు 980 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఒక్కో పీహెచ్‌సీలో ఒక్కో విధంగా ఉద్యోగులు ఉండేవారు. దీంతో రోగులకు నామమాత్రంగానే సేవలు అందేవి. ఉన్నవారితోనే సర్దుబాటు చేసి వంపించేవారు. కొన్ని ఆస్పత్రుల్లో అటెండర్లు, స్వీపర్లే కట్లుకట్టి, సూదు మందు ఇచ్చే పరిస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి పీహెచ్‌సీలోనూ సిబ్బందిని అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రత్యేకంగా 143 జీవోను అమలుచేశారు. పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్ట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్, హెల్త్ సూపర్‌వైజర్లు ఇద్దరు (పురుష, మహిళ), సీహెచ్‌ఓ లేదా ఎంపీహెచ్‌ఓల్లో ఒకరు, హెల్త్ ఎడ్యుకేటర్, పీహెచ్‌ఎన్, ఎఫ్‌ఎన్‌ఓ, లాస్ట్ గ్రేడ్ సర్వీస్ (ఎల్‌జీఎస్) ఇలా 14 మంది ఒక పీహెచ్‌సీలో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ఫ్యామిలీ డాక్టర్..

ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామీణులకు మెరుగైన వైద్యం మరింత చేరువైంది. షెడ్యూల్ మేరకు ఇంటి వద్దకే వైద్యులు వెళ్లి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. మరో పక్క జగనన్న సురక్ష ద్వారా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధిగ్రస్తులను జల్లెడ పట్టి చికిత్స అందించారు. షుగర్, బీపీ లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా మందులు అందేలా కృషి చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు అందించారు. దీంతో లక్షలాది మంది పేదలు ఆరోగ్య సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకున్నారు.

వైద్యం చేరువైంది



మా గ్రామం కర్ణాటక సరిహద్దుకు ఆనుకుని ఉంది. జబ్బు ఏదైనా సరే మండల కేంద్రానికి పరుగులు తీయాల్సి వచ్చేది. జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్యం చేరువైంది. విద్య, వైద్యం కోసం గడిచిన 59 నెలలు పెద్దపీట వేశారు.

– ఐశ్వర్య, మలపనగుడి, డీ హీరేహాళ్ మండలం

ఆస్పత్రి రూపురేఖలు మారాయి



గడిచిన 59 నెలల కాలంలో ప్రభుత్వ ఆస్పత్రులు రూపు దిద్దుకున్నాయి. కార్పొరేట్ ఆస్పత్రులను తలపించేలా వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. మారుమూల గ్రామాల ప్రజలకు సైతం నాణ్యమైన వైద్య సేవలు చేరువయ్యాయి.

– లీలావతి, బీటీపీ, గుమ్మఘట్ట మండలం

మా ఓట్లన్నీ ఏమయ్యాయో ?



సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై అందరికీ అనుమానం ఉంది. లబ్ధిదారులు, వైఎస్సార్, జగనన్న అభిమానులు పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీకే ఓటేశారు. ప్రజలు చెబుతున్న మాట తీరు చూస్తే కచ్చితంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే ఏర్పాటు కావాల్సి ఉంది. అయితే అందుకు విరుద్ధంగా కూటమి అధికారంలోకి వచ్చింది. మా ఓట్లన్నీ ఎక్కడికెళ్లాయి? ఏమైపోయాయి అంటూ ప్రజలందరూ చర్చించుకుంటున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఈ ఎన్నికలు జరగలేదు. ఈవీఎంలను టెక్నాలజీతో టాంపరింగ్ చేశారు. ప్రజాక్షేత్రంలో గెలవలేమని తెలుసుకొన్న చంద్రబాబు సాంకేతిక నిపుణులతో కలిసి ఈవీఎంలను టాంపరింగ్ చేశారు.

– వడ్డే రవీంద్ర, ఎన్.హనుమాపురం

తహసీల్దార్ కారు బోల్తా

- సురక్షితంగా బయటపడిన డ్రైవర్

శింగనమల: బుక్కరాయసముద్రం సమీపంలోని అనంత విద్యానికేతన్ వద్ద కారుఅదుపు తప్పి బోల్తా పడింది. వివరాలు..శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మొహన్‌బాబును వదిలి, పని మీద డ్రైవరు మాత్సుపాల్ కారు తీసుకెళ్లారు. పని ముగించుకొని అనంతపురం నుంచి వస్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదంలో డ్రైవరుకు ఎటువంటి గాయాలు కాలేదు. కారు మాత్రం దెబ్బతింది.

ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం

- ఏ కష్టం వచ్చినా కార్యకర్తలకు అండగా ఉంటా
- కార్యకర్తలతో డాక్టర్ తలారి రంగయ్య


కార్యకర్తలతో సమావేశమైన డాక్టర్ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని, రాజకీయంలో గెలుపు ఓటమి అనేది సహజమని వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య అన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో బూత్‌ల వారీగా వచ్చిన ఫలితాలపై అడిగి తెలుసుకున్నారు. ఐదేళ్లలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమాన్ని అందించామన్నారు. వైఎస్సార్‌సీపీ ఓటమి పాలవ్వడం ఊహించని పరిణామమన్నారు. నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఏ కష్టం వచ్చినా నేరుగా తనను కలవవచ్చన్నారు. తనతో పాటు ఎన్నికల్లో కష్టపడిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు ఎల్లప్పుడూ కృతజ్ఞుడిగా ఉంటానని తెలిపారు. తన వెంట ఉండి నడిచిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి గెలిచిన పార్టీకి తన వంతుగా సహకారం అందిస్తామని చెప్పారు. రాబోవు రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసుకుని ముందుకు వెళ్లేందుకు శాయశక్తులా కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి తో పాటు వివిధ మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచ్ ఫిర్యాదుపై విచారణ


గడేహోతురులోని వాటర్‌ప్లాంట్ ఇదే

వజ్రకరూరు: మండల పరిధిలోని గడేహోతురులో మంగళవారం రాత్రి టీడీపీ కార్యకర్తలు వాటర్‌ప్లాంట్ తాళాలు పగులగొట్టిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సర్పంచ్ కె.సురేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం సిబ్బందితో కలిసి ఎస్‌ఐ నరేష్ గడేహోతురులో పర్యటించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ సురేంద్ర మాట్లాడుతూ.. మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు వాటర్‌ప్లాంట్ తాళాలు పగులగొట్టారు. అనంతరం వాటర్‌ప్లాంట్‌కు కొత్త తాళాలు వేసి తీసుకెళ్లినట్లు పోలీసులకు వివరించారు. గత కొన్ని సంవత్సరాలుగా వాటర్‌ప్లాంట్‌ను పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాటర్ ప్లాంట్‌కు తాళాలు వేయడంతో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.

అండర్–19 జట్టుకు ఎంపిక

గుంతకల్లు: గుంతకల్లు ఆర్డీటీ క్రికెట్ శిబిరానికి చెందిన బట్నపాడు అమూల్య, బట్నపాడు నందిని (అక్కాచెల్లెలు) అండర్–19 మహిళ జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికై నట్లు ఆర్డీటీ కోచ్ ఇనయతుల్లా బుధవారం తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన ప్రాబబుల్స్ మ్యాచ్‌లో ఇద్దరు మంచి ప్రతిభ కనబరచి ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 7 నుంచి 12 వరకు వెంకటగిరిలో జరిగే అండర్–19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో పాల్గొంటారన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

ఆవు దాడిలో మహిళా రైతుకు గాయాలు

గుత్తి రూరల్: అబ్బేదొడ్డి గ్రామంలో బుధవారం ఆవు దాడిలో ఓ మహిళా రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. గ్రామానికి చెందిన శివమ్మ తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా ఆవు బెదిరి ఆమెపై దాడి చేసింది. గమనించిన తోటి కూలీలు అపస్మారక స్థితిలో పడి ఉన్న శివమ్మను గమనించి 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు విచారణ చేపట్టారు.

కూడేరులో మోస్తరు వర్షం


వజ్రకరూరులో కురుస్తున్న వర్షం

కూడేరు: మండలంలో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులుతో మోస్తరు వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులకు ఊరటనిస్తున్నాయి. పంటల సాగుపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోంది. పంటలు సాగు చేసేందుకు రైతులు ధైర్యంగా ముందుకొస్తున్నారు. ఈనెల 15 నుంచి వేరుశనగ విత్తనం విత్తుకోవడానికి అదును కాలం. వర్షాలు బాగా కురుస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం ఏడు గంటలకు ప్రారంభమైన వర్షం అరగంటకు పైగా కురిసింది. వర్షపు నీరు కాలనీల నుంచి మెయిన్ రోడ్డు మీదుగా చెట్టు కుంట వైపు ప్రవహించాయి. ఇటీవల విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో భూగర్భ జలాలు పెరగనున్నట్లు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వేరుశనగ పంటతో పాటు ఆముదం, కంది తదితర పంటలను సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటిన ఫారెస్ట్ అధికారులు


చిన్నంపల్లి పాఠశాలలో మొక్కలు నాటుతున్న దృశ్యం

రాయదుర్గం రూరల్: విరివిగా మొక్కలు నాటి పచ్చదనం పెంచితేనే పర్యావరణ పరిరక్షణకు దోహదం చేసిన వారమవుతామని ఎఫ్‌బీఓ ఆంజనేయులు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ , ఎన్‌సీసీ విభాగాలు, అటవీశాఖ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి బుధవారం కళాశాల ఆవరణలో 150 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి నారాయణ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో పర్యావరణ అసతుల్యత కారణంగా మానవాళి అనేక విపత్తులను ఎదుర్కొంటోందన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్వలాభం కోసం ఇష్టారాజ్యంగా చెట్లు నరికి అడవులను నాశనం చేయకుడదన్నారు. విద్యార్థులు తమ వంతుగా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఎఫ్‌బీఓ ప్రవీణ్‌కుమార్, విశ్వనాథ్ , గోపాల్ , రవి, అధ్యాపకులు వినోద్ కుమార్, రఘు, బోధనేతర సిబ్బంది అనిల్ , అస్లాం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి

కళ్యాణదుర్గం రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి బండి


మాట్లాడుతున్న జడ్జి సుభాన్

సుభాన్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి బండి సుభాన్ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రకృతి ప్రసాదించిన అడవులను నరకడం, వన్యప్రాణులను వేటడంలాంటివి చేయరాదన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరి చక్రవర్తి న్యాయవాదులు దేవేంద్ర, మల్లికార్జున, ముత్యాలప్ప, తులసినాయక్, రమేష్, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంఈఓ శ్రీధర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ తిమ్మక్క అన్నారు. బుధవారం చిన్నంపల్లి జెడ్పీహెచ్ పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, ఫారెస్ట్ అధికారులు సుమారు 200 మొక్కలు నాటి నీరుపోశారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులతో సీడ్‌బాల్స్ కోసం గ్రామంలో వేప, కానుగ, సీమచింత, చింత విత్తనాలు సేకరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ పాల్గొన్నారు.

మొక్కలు విరివిగా పెంచాలి

వజ్రకరూరు: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు విరివిగా పెంచాలని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని రాగులపాడులో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ బీట్ అధికారి సతీష్ కుమార్ మాట్లాడుతూ.. మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. సకాలంలో వర్షాలు కురుస్తాయని వెల్లడించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రజలకు చింత, నా రేపి, కానుగ తదితర మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ఉరవకొండ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ జేఈ కావ్య, ప్లాంట్ వాచర్ మల్లికార్జున పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలందించాలి


రికార్డులను పరిశీలిస్తున్న డీపీఎంఓ రవిశంకర్

బొమ్మనహాళ్: ప్రభుత్వాస్పత్రిలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డీపీఎంఓ రవి శంకర్ తెలిపారు. బుధవారం మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో స్థానిక ప్రజాఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. ఇంటింటి సర్వే సక్రమంగా నిర్వహించి ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితులను నమోదు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. గోవిందవాడలో గర్భిణీ మృతికి గల కారణాలను మృతురాలి రికార్డు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణీ రఫీయా సుల్తానా, సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎంపీడీఓ కార్యాలయం


పైకప్పు పెచ్చులూడిన దృశ్యం


గదిలో రికార్డులు, కంప్యూటర్లు

కూడేరు: ఉపాధిహామీ కార్యాలయాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని రెండు గదుల్లో నిర్వహిస్తున్నారు. కాగా ఈ భవనం పాతబడిపోవడంతో ఒక గది భవనం కప్పు పూర్తిగా దెబ్బతిని పెచ్చులూడి కిందపడుతున్నాయి. సిబ్బంది విధులు నిర్వర్తించేందుకు భయపడుతున్నారు. బిల్లులు ఇతర పనులు కోసం కూలీలు వస్తుంటారు. ఇప్పటికే పలుమార్లు పెచ్చులూడి కిందపడినప్పుడు త్రుటిలో తప్పించుకున్నారు. మరొక గది పైకప్పు కిందికి కొద్దిగా కుంగింది. చిన్నపాటి వర్షం వస్తే నీరు గదుల్లోకి చేరుతోంది. దీంతో రికార్డులు, కంప్యూటర్లు వర్షపు నీటికి తడుస్తున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి భవనం పైకప్పుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. నూతన భవనం నిర్మించాలని ఉపాధి కూలీలు, సిబ్బంది కోరుతున్నారు.

విద్యార్థులకు బెల్టులు వచ్చేశాయ్..

యల్లనూరు: సర్కారు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాం బెల్టులు ఎమ్మార్సీకి వచ్చాయని ఎంఈఓలు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి తెలిపారు. మొత్తం 1855 మంది విద్యార్థులకు బెల్టులు మంజూరయ్యాయి. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 1258, అలాగే 6వ తరగతి నుంచి 8 వరతగతి వరకు 370, 9వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 227 మందికి బెల్టులు వచ్చాయన్నారు.

రాయదుర్గంలో నోటాకు 2,370 ఓట్లు

రాయదుర్గంటౌన్: ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో రాయదుర్గం నియోజకవర్గంలో మొత్తం 13 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 41,659 ఓట్ల మెజార్టీతో రాయదుర్గం ఎమ్మెల్యేగా కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు గెలుపొందిన విషయం తెలిసిందే. నియోజకవర్గంలో 296 పోలింగ్ బూత్‌లకుగాను మొత్తం 2,64,248 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,27,248 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో 2,370 మంది ఓటర్లు నోటాకు ఓటేయడం విశేషం.

కంది విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోండి

రాయదుర్గం రూరల్: ఖరీఫ్‌లో ప్రత్యేకంగా కంది సాగు లేదంటే వేరుశనగలో అంతర్ పంటగా కందిని సాగు చేసుకోవాలనుకునే రైతులు కంది విత్తనం కోసం రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ మహేంద్ర తెలిపారు. రాయదుర్గం మండలంలోని 15 ఆర్బీకేలకు 40 క్వింటాళ్ల ఎల్‌ఆర్‌జీ 52 రకం కంది విత్తనాలు మంజూరైనట్లు చెప్పారు. ఇందులో 74 ఉడేగోళం , ఆవులదట్ల ఆర్బీకేలకు రెండేసి క్వింటాళ్ల చొప్పున, మిగిలిన 13 ఆర్బీకేలకు 3 క్వింటాళ్లు చొప్పున కందివిత్తనాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కందులు బహిరంగ మార్కెట్లో క్వింటాల్ రూ.13,980 కాగా ప్రభుత్వం అందించే రూ.4,194 సబ్సిడీ పోను రైతులు క్వింటాల్ కందులకు రూ.9,786 చెల్లించాల్సి ఉంటుందన్నారు.